
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శుక్రవారం 27 సెప్టెంబరు 2024



పరిసరాల పరిశుభ్రతతో
సంపూర్ణ ఆరోగ్యం
8లో..

రోగి బంధువుపై
ఆసుపత్రి సిబ్బంది దాడి
7లో..



స్వాహా పర్వం

- వ్యవసాయ సహకార సంఘాల్లో బడా స్కాం
- ఆరు సొసైటీలు, రెండు డీసీఎంఎస్‌లలో వెలుగుచూసిన అక్రమాలు
- రూ. 7.36 కోట్ల పైగా నిధుల గోల్‌మాల్
- ఆరుగురు సీఈవోల సస్పెన్షన్
- ఆరు సహకార పాలకవర్గాలకు షోకాజు నోటీసులు
- జిల్లా సహకార శాఖలో కలకలం

జగిత్యాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో పెద్ద ఎత్తున నిధుల స్కాం జరగడం చర్చనీయాంశంగా మారుతోంది. కొన్ని సంవత్సరాల నుంచి సహకార సంఘాలు, డీసీఎంఎస్‌లలో యథేచ్ఛగా అక్రమాలు జరుగుతున్నప్పటికీ సరియైన తనిఖీలు లేకపోవడం, పర్యవేక్షణ లోపం, అక్రమార్కులకు రాజకీయ అండదండలు అందుతుండడం కారణంగా ఈ అక్రమాలు బయట పడలేదు. అయితే కొద్ది రోజుల క్రితం జిల్లాలోని పలు సంఘాలపై ఫిర్యాదులు అందడంతో ఉన్నతాధికారులు సీరియస్‌గా బావించారు. ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ఆరు సహకార సంఘాలు, రెండు డీసీఎంఎస్‌లలో ఇటీవల సీరియస్ తనిఖీలు చేపట్టారు. దీంతో ఆరు సహకార సంఘాలు, రెండు డీసీఎంఎస్‌లలో పెద్ద ఎత్తున నిధుల దుర్వినియోగం జరిగినట్లు వెల్లడైంది. అక్రమాలకు పాల్పడిన ఈ సంఘాల సీఈఓలను సస్పెండ్ చేయాలని ఆదేశిస్తూ సంబంధిత సహకార సంఘాల పాలక వర్గాలకు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో పాటు సంబంధిత సహకార సంఘాల పాలకవర్గాలను ఎందుకు రద్దు చేయకూ డదో సమాధానం ఇవ్వాలంటూ ఆరు సొసైటీలకు షోకాజు నోటీసులు జారీ చేశారు. ఈ వ్యవహారం సహకార శాఖలో కలకలం రేపింది.

దుర్వినియోగం ఆరోపణలు ఇవే...

జిల్లాలోని తిమ్మాపూర్ సొసైటీలో నిర్మించిన సంఘ భవనం వ్యవహారంలో నిధుల గోల్‌మాల్ జరిగిందన్న ఆరోపణలు వచ్చాయి. ధర్మపురి సొసైటీ పరిధిలో గోదాం నిర్మాణం, ఓ స్థలం కొనుగోలు వ్యవహారంలో, జైనా సొసైటీలో ఓ స్థలం కొనుగోలు, గోదాం నిర్మాణం, పెగడపల్లి సొసైటీలో జరిగిన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం వ్యవహారంలో, నంచర్ల సొసైటీలో మూడు స్థలాల కొనుగోలు, పెట్రోలు బంకు నిర్వహణ వ్యవహారంలో, గొల్లపల్లి సొసైటీలో సంఘం భవన నిర్మాణ అభివృద్ధి వ్యవహారంలో అవకతవకలు జరిగాయంటూ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ధర్మపురి, గొల్లపల్లి డీసీఎంఎస్‌ల కార్యకలాపాలలో ప్రైవేటు వ్యాపారులను భాగస్వామ్యం చేయడం, విత్తనాలు, ఎరువుల అమ్మకాలలో నిబంధనలు పాటించకపోవడం వంటి అవకతవకలు జరిగినట్లు అధికారులు తనిఖీల్లో గుర్తించారు. వీటితో పాటు సహకార సంఘాల ఆధ్వర్యంలో పలు సీజన్‌లలో జరిగిన ధాన్యం కొనుగోళ్ల సందర్భంగా పరికరాల కొనుగోలు వ్యవహారంలో సైతం అక్రమాలు జరిగినట్లు అధికారులు గుర్తించారు.

ఆరు సొసైటీలు, రెండు డీసీఎంఎస్‌లలో రూ. 7.36 కోట్ల అక్రమాలు..

ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఆరు సింగిల్ విండో సొసైటీలు, రెండు డీసీఎంఎస్‌లలో 2014-18 పాలకవర్గం పీరియడ్‌లో, 2018-23 పాలకవర్గం పీరియడ్‌లలో రూ. 7,36,05,881 నిధుల దుర్వినియోగం జరిగిందన్న ఫిర్యాదు ఇటీవల సహకారశాఖ రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదు అందింది. ఇందులో ఆరు సింగిల్ విండో సొసైటీల్లో రూ. 7,16,52,048, రెండు డీసీఎంఎస్‌లలో 19,53,833 దుర్వినియోగం అ యునట్లు ఫిర్యాదు జరిగింది. పెగడపల్లి సొసైటీలో రూ. 1,81,45,068, నం చర్ల సొసై టీలో రూ. 96,12,148, తిమ్మాపూర్ సొసైటీలో 67,18, 387, గొల్లపల్లి సొసైటీలో రూ. 53,58,809, ధర్మపురి సొసైటీలో 1,62,19,187, జైనా సొసైటీలో రూ. 1,55, 98,449లు దుర్వినియోగం చేసినట్లుగా అధికారులకు ఫిర్యాదు అందింది. వీటితో పాటు ధర్మపురి డీసీఎంఎస్‌లో రూ. 6,46,377, గొల్లపల్లి డీసీఎంఎస్‌లో రూ.13,07,456 నిధులు దుర్వినియోగం చేసినట్లుగా ఆరోపణలున్నాయి. ఇదే తరహాలో మరికొన్ని వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో సైతం అవినీతి, అక్రమాలు, నిధుల దుర్వినియోగం చోటు చేసుకు న్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

ఆరుగురు సీఈవోల సస్పెన్షన్...

సహకార సంఘాల్లో అవకతవకలపై విచారణ జరిపిన అధికారుల బృందం ఇచ్చిన నివేదిక ఆధా రంగా ఆరుగురు సీఈవోలను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సంబంధిత సీఈవోలను సస్పెండ్ చేయాలని ఆదేశిస్తూ సహకార సంఘాల పాలకవర్గాలకు ఆదేశాలు జారీ చేశారు. పెగడపల్లి సీఈవో గోపాల్‌రెడ్డి, నంచర్ల సీఈవో మధుకర్, తిమ్మాపూర్ సీఈవో ప్రభాకర్‌రెడ్డి, జైనా సీఈవో సాగర్‌రావు, ధర్మపురి సీఈవో అయ్యోరు రాజేశ్, గొల్లపల్లి సీఈవో సుధాకర్‌రావులను సస్పెండ్ చేస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటు అవకతవకలు జరిగిన పాలకవర్గాలను ఎందుకు సస్పెండ్ చేయకూడదో వారంరోజుల లోపు తెలపాలంటూ పాలకవర్గాలకు షోకాజు నోటీసులను జారీ చేశారు. అవకతవకలపై పాలకవర్గ సమావేశాలు నిర్వహించి చర్చించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

పర్యవేక్షణ, తనిఖీల లోపమే కారణం...

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆర్థికపరమైన కార్యకలాపాలను, రికార్డుల నిర్వహణ ను ఎప్పటికప్పుడు సహకారశాఖ ఉన్నతాధికారులు తనిఖీలు చేయకపోవడం, పర్యవేక్షణ చేయకపోవడం అక్రమాలకు ఆస్కారమిస్తోందన్న అభిప్రాయలు వ్యక్తం అవుతున్నాయి. ఎప్పటికప్పుడు తని ఖీలు చేయాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులున్నాయి. ఉన్నతాధికా రులు పర్యవేక్షణలో పాన్ని ఆసరాగా చేసుకుంటున్న పీఏసీఎస్ సీఈవోతో పాటు కిందిస్థాయి సిబ్బంది ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారన్న విమర్శలున్నాయి. కొన్ని పీఏసీఎస్‌లు మాత్రం ఎలాంటి అక్రమాలకు ఆస్కారం ఇవ్వకుండా కొనసాగుతున్నాయి. రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందితే గాని అధికారులు చర్యలు తీసుకోని పరిస్థితి తలెత్తు తోందంటున్నారు.

అధికారుల బృందంతో తనిఖీలు..

సహకార సంఘాల్లో నిధుల దుర్విని యోగంపై వచ్చిన ఆరోపణలపై రాష్ట్ర సహకార శాఖ కమి షనర్ ఆదేశాల మేరకు ఈనెల 10వ తేదీ నుంచి 22వ తేదీ వరకు జిల్లాలో ఎనిమిది ఉన్నతస్థాయి అధికారులు బృందంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. హైద్రాబాద్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన సహకార శాఖ ఉన్నతాధికారులచే పరిశీలించారు. ఇద్దరు సభ్యులు గల ఒక్కో బృందం ఒక్కో సహకార సంఘంలో తనిఖీలు నిర్వహించింది. సహకారశాఖకు చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్, సహకారశాఖ సీనియర్ ఇన్స్‌పెక్టర్లు బృందం సభ్యులుగా వ్యవహరించారు. తనిఖీల్లో గుర్తించి అవకత వకలపై ఈనెల 23న రాష్ట్ర సహకారశాఖ కమిషనర్‌గా నివేదిక సమర్పించింది.

అడుగడుగునా రాజకీయ ఒత్తిళ్లు...

జిల్లాలోని పలు వ్యవసాయ సహకార సంఘాలు, డీసీఎంఎస్ కేంద్రాలకు సంబంధించిన అన్ని రకాల కార్యకలాపాల్లో రాజకీయ ప్రమేయం ఎక్కువగా ప్రభావం చూపుతోందన్న విమర్శలున్నాయి. రాజకీయ జోక్యం కారణంగా అధికారులు ఇటువైపు పెద్దగా దృష్టి సారించలేక పోవడానికి కారణమవుతోందన్న అభిప్రాయాలున్నాయి. సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లంతా తమకున్నా రాజకీయ పలుకుబడి, పరపతితో సంబంధిత అధికారులు, సిబ్బందికి పరోక్షంగా అండదండలు అందిస్తున్నారన్న విమర్శలున్నాయి. ఏదీఏమైనా ఎప్పటికప్పు డు పకడ్బందీగా ఉన్నతాధికారులు పర్యవేక్షణ జరిపితే అక్రమాలు, నిధుల గోల్ మాల్‌లను అరి కట్ట వచ్చని ఆ దిశగా దృష్టి సారించాలని సంబంధిత వర్గాలు అంటున్నాయి.

అక్రమాలకు పాల్పడ్డ ఆరుగురు సీఈవోల సస్పెన్షన్

జిల్లాలోని ఆరు వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో అక్రమాలకు పాల్పడ్డ ఆరుగురు సీఈవోలను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు నిర్ణ యం తీసుకు న్నారు. ఈ మేరకు సంబందిత సహకార సంఘాల పాలక వర్గాలకు ఆదేశాలు ఇచ్చాము. దీంతో పాటు సంబంధిత సహకార సం ఘాల పాలకవర్గాలకు సైతం షోకాజ్ నోటీసులు జారీ చేశాము. వారం రోజుల్లో సమాధానం ఇవ్వాలని ఆదేశించాము. సంతృప్తికరమైన సమాధా నం రాకుంటే చర్యలు తీసుకుంటాము.

- సీహెచ్ మనోజ్ కుమార్, జిల్లా సహకార శాఖ అధికారి

ధైర్యమే విజయానికి తొలిమెట్టు

- ఎమ్మెల్యే సంజయ్ కుమార్
- జగిత్యాలలో ఘనంగా జాతీయ యువజన దినోత్సవం



విద్యార్థుల ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, అదనపు కలెక్టర్

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 26 : ధైర్యమే విజయానికి తొలిమెట్టు అని ప్రతి విద్యార్థి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో వివేకానంద జయంతిని పురస్కరించుకుని జిల్లా యువజన, క్రీడ ల శాఖ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హాజరై అదనపు కలెక్టర్ రాంబాబు, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతితో కలిసి వివేకానంద చిత్ర పటానికి పూల మాల వేసి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుల పట్ల శ్రద్ధ వహించి మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. లక్ష్య సాధనే ధ్యేయంగా ముందుకు సాగాలన్నారు. మినీ స్టేడియంలో తన స్వంత డబ్బులతో వివేకానంద విగ్రహ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులు చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించగా, సైన్స్ ఫేర్ షోలు ఆలో చింపజేశాయి. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో రవి కుమార్, కౌన్సిలర్లు గంగమ ల్లు, ధర్మరాజు, అనీల్, నారాయణ రెడ్డి, శ్రీకాంత్, నాయకులు సుధాకర్, రాం మోహన్‌రావు, శ్రీనివాస్, ప్రభాత్ సింగ్, రాజు ఉన్నారు.

జిల్లా స్థాయి ఫుట్‌బాల్ ఎంపిక పోటీలు



ఎంపికైన క్రీడాకారులతో పీఈటీలు

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 26 : జిల్లా కేంద్రంలోని వివేకానంద మిని స్టేడి యంలో అండర్ 14, 17 విభాగాల్లో గురువారం జిల్లా స్థాయి ఫుట్ బాల్ ఎం పిక పోటీలను నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలల నుంచి 150 మం ది విద్యార్థులు పాల్గొని ఫుట్ బాల్ ఎంపిక పోటీల్లో తమ ప్రతిభను చాటారు. ఎంపికైన విద్యార్థులు త్వరలో జరగనున్న ఉమ్మడి జిల్లా పోటీల్లో పాల్గొనను న్నట్లు డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి, క్రీడల కార్యదర్శి లక్ష్మీరామ్ నాయక్‌లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పేట అధ్యక్ష, కార్యదర్శులు విశ్వ ప్రసాద్, అశోక్, పీడీలు అజయ్, కృష్ణ ప్రసాద్, కోటేశ్వర్, సాగర్, వేణు. భాస్కర్, దయాకర్, శ్రీరామ్ ఉన్నారు.

జిల్లా లైబ్రరీని సందర్శించిన ఎమ్మెల్యే సంజయ్



నిరుద్యోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జగిత్యాల అర్బన్, సెప్టెంబరు 26: జిల్లా కేంద్రంలోని గ్రంథాలయాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ గురువారం సందర్శించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే నిరుద్యోగులకు మధ్యాహ్న భోజనానికి ఇబ్బంది కలు గుతుందని ఎమ్మెల్యేతో చెప్పగానే స్పందించి తక్షణమే గ్రంథాలయానికి వచ్చే నిరుద్యోగ యువతకు భోజన వసతి కల్పించి వారితో కలిసి భోజనం చేశారు. గ్రంథాలయంలో విద్యార్థుల అవసరార్థం పోటీ పరీక్షల పుస్తకాలు ఏర్పాటు చే స్తామని, అదనంగా రీడింగ్ రూమ్‌కు సైతం నిధులు మంజూరు చేసి ఇస్తా మని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ శంకుతల, మాజీ డైరె క్టర్ చెట్‌పెల్లి సుధాకర్, ప్రభాసింగ్ రాగూర్, చెట్ల మనోహర్, శశి పాల్గొన్నారు.

ఆర్టీసీ యాజమాన్యంపై పెట్టిన కేసులు ఎత్తివేయాలి

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఆర్టీసీ ఉద్యోగుల వినతి

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 26: రాష్ట్ర సాధనలో ఉద్యమంలో భాగంగా నిర్వహించిన సకలజనుల సమ్మె కాలంలో ఆర్టీసీ యాజమాన్యంపై జగిత్యాల పోలీసులు పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరుతూ ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు, విశ్రాంత ఉద్యోగులు గురువారం స్థానిక ఇందిరాభవన్‌లో పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కేసుల వల్ల ప్రతిసారి కోర్టులకు హాజరుఅవ్వాల్సి వస్తుందని, కేసులను ఎత్తివేయాలని కోరారు. స్పందించిన జీవన్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి, పరిష్కరం కోసం తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారని ఆర్టీసీ కార్మికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు కేహెచ్‌పీ రావు, టీపీ రెడ్డి, లక్ష్మణ్, రాజేశం, పద్మ, సుజాత, దశరథం, నరేందర్ తదితరులున్నారు.

ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి

కలెక్టర్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

జగిత్యాల అగ్రికల్చర్, సెప్టెంబరు 26: సాయుధ రైతాంగ పోరాటయోధురాలు వీరనారి చాకలి ఐలమ్మ అని, ఆమె ఆశయ సాధనకు కృషి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని స్థానిక చింతకుంట చెరువు మినీ ట్యాంక్‌బండ్ వద్ద గల చాకలి ఐలమ్మ విగ్రహానికి పూల మాల వేసి, నివాళులు అర్పించారు. నాటి తెలంగాణ సాయుధ పోరాటంలో బడుగు, బలహీనవర్గాల హక్కుల కోసం అలుపెరు గని పోరాటం చేసిన వీరవనిత చాకలి ఐలమ్మ అన్నారు. చాకలి ఐలమ్మ జయంతి, వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, అదనపు కలెక్టర్ రాంబాబు, ఆర్డీవో మదుసూధన్, డీపీవో రఘువరన్, మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య తదితరులున్నారు.

●సాయుధపోరాట స్ఫూర్తి చాకలి ఐలమ్మ అని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటానికి పూ లమాల వేసి నివాళులు అర్పించారు.

●తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక ఐలమ్మ అని జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఐలమ్మ చిత్రపటా నికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ గౌతమ్‌రెడ్డి, బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారులు సాయిబాబా, రాజ్‌కుమార్, కార్యాలయ ఏవో హన్మంత్‌రావు, సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ తదితరులున్నారు.

●ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాస జగిత్యాలలో చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ఏడీఆర్ శ్రీలత ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ధర్మపురి: ధర్మపురి పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. చింతా మణి చెరువు వద్ద ఐలమ్మ విగ్రహానికి పలువురు ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు, రజక సంఘం నేతలు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ, రజక సంఘం పట్టణ అధ్యక్షులు గుండారపు అర్జున్, మండల అధ్యక్షుడు ర్యాగల్ల నారాయణ, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రాజేష్, బీజేపీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.



జగిత్యాలలో ఐలమ్మకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, జీవన్‌రెడ్డి

మెట్‌పల్లి టౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద గురువారం చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను రజక సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి వేడుకలను జరిపారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు, టీజేఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంతి మోహన్‌రెడ్డి, రజాక సంఘం నాయకులు ఆమె విగ్రహానికి వేర్వేరుగా పూలమాలలు వేసి జయంతి వేడుకలలో పాల్గొన్నారు. పట్టణ ఐదు రజక సంఘం అధ్యక్షులు వన్నెల శశి, కలికోట వేణు, రాజ్‌కుమార్, సాయిలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోరుట్ల : ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తి తెలంగాణ ప్రజలు మరలేనిదని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. గురువారం మున్సిపల్, రజక సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతి వేడుకలో భాగంగా ఐలమ్మ విగ్రహానికి మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య-అనిల్, నాయకులతో కలిసి నివాళ్లను అర్పించారు. మున్సిపల్ కమీషనర్ తిరుపతి, ఎంబేరి నాగభూషణం, గంగాధర్, నాయకులు గంగాధర్, రాజం, మధు, సీపీఐ నాయకులు రాములు, విశ్వనాథం, మౌళానా, పద్మశాలి సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌లతో పాటు పలు వురు పాల్గొన్నారు.



ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న జువ్వాడి నర్సింగరావు

●పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ అని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఐలమ్మ విగ్రహానికి రజక సంఘ నాయకులతో కలిసి పూలమాలవేసి నివాళ్లను అర్పించారు. కౌన్సిలర్లు పేర్ల సత్యం, సజ్జు పాల్గొన్నారు.



ధర్మపురిలో వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, రజక సంఘం నేతలు

నిజామాబాద్ ఎంపీ అర్వింద్‌ను కలిసిన ఆర్యవైశ్యులు



ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు ఆహ్వాన పత్రం అందిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

జగిత్యాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను గురువారం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు మైలారపు లింబాద్రితో పాటు పలువురు సంఘ సభ్యులు కలిశారు. నిజామాబాద్‌లోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ ధర్మపురి అర్వింద్, ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణలను కలిసి ఈనెల 29వ తేదిన మెట్‌పల్లిలో జరగనున్న ఆర్యవైశ్య మహాసభ జగిత్యాల జిల్లా శాఖ కార్యవర్గ పదవీ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరుకావాల్సిందిగా కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు.

ఈ కార్య క్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘ నాయకులు గంప శ్రీనివాస్, చాడ చందు, కట్కం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం ఘటనపై వీడియో వైరల్

- ఎస్సై వేధింపులే కారణమంటూ బంధువుల ఆరోపణ - విచారణ చేపట్టిన పోలీస్ శాఖ?

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 26: కుటుంబ కలహాలతో ఈనెల 23న జగిత్యాల జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన బొల్లారపు శివప్రసాద్ అనే యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కోరుట్ల ఎస్సై దాడి చేయడంతోనే తన సోదరుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ప్రశాంతి ఆరోపిస్తోంది. ఈ ఘటనపై శివప్రసాద్ సోదరి ప్రశాంతి హైదరాబాద్ గాంధీ ఆసుపత్రి నుంచి విడుదల చేసిన వీడియో బుధవారం నుంచే జగిత్యాల జిల్లాలో వైరల్ అవుతోంది.

శివప్రసాద్‌కు తన భార్యకు మధ్య వివాదం జరగడంతో ఈనెల 22న కోరుట్ల పోలీసులు ఫిర్యాదు మేరకు శివప్రసాద్‌ను పిలిపించారు. ఆ మరుసటి రోజే శివకుమార్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అయితే ఎస్సై దాడి చేయడంతోనే ఈ ఘటన జరిగినట్లు బాధితుడి కుటుంబ సభ్యులు విడుదల చేసిన వీడియో కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీస్ శాఖ విచారణ చేపట్టినట్లు తెలిసింది. ఈ నెల 22న కోరుట్ల పోలీస్ స్టేషన్ లో అసలు ఏమి జరిగింది అనే కోణంలో పోలీస్ అధికారి విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు సమాచారం.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, సెప్టెంబరు 26: నిబంధనలకు విరుద్ధంగా మండలంలోని దాచారం గ్రామానికి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ గురువారం తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలం అంకుసాపూర్ గ్రామం నుంచి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేసినట్లు పేర్కొన్నారు. అంకుసాపూర్ గ్రామానికి చెందిన గౌరవేని రాజును రిమాండ్‌కు తరలించినట్లు, ట్రాక్టర్‌ను సీజ్‌చేసినట్లు తెలిపారు

ఎల్లారెడ్డిపేటలో చోరీ

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 26: ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కిష్టంపల్లిలో తాళం వేసి ఉన్న మొగుళ్ల మల్లేశం ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. తాళం బద్దలు కొట్టిన చోరులు లోనికి ప్రవేశించి బీరువాలను ధ్వంసం చేశారు. బీరువా తెరచుకోకపోవడంతో అక్కడ నుంచి జారుకున్నారు. మండల కేంద్రంలో ఇంటి ఎదుట నిలిపిన ఎర్రవెళ్లి కృష్ణకు చెందిన ద్విచక్రవాహనాన్ని ఎత్తుకెళ్లారు. బాధితులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రమాకాంత్ ఆధ్వర్యంలోని పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని వివరాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ఎస్‌యూలో సమస్యలను పరిష్కరించాలి


వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

గణేశ్‌నగర్, సెప్టెంబరు 26: ఎస్‌యూ సమస్యలను పరిష్కరించాలని ఇన్‌చార్జి ఉపకులపతి సురేంద్ర మోహన్‌కు ఏబీవీపీ శాతవాహన యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. యూనివర్సిటీలోని 14 కోర్సుల్లో ఎనిమిది కోర్సులు సెల్ఫ్‌ఫైనాన్స్‌గా ఉండడం వల్ల బడుగుబలహీన వర్గాల విద్యార్థులు ఫీజులు కట్టలేక పోతున్నారన్నారు. కోర్సులని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీలోని బోధన, బోధనేతర సిబ్బందిని వెంటనే నియమించాలన్నారు. విశ్వవిద్యాలయంలో 114మంది సిబ్బంది అవసరం ఉంటే కేవలం 63 మంది సిబ్బందితో నడుపుతున్నారన్నారు. సరైన విద్య అందక విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. పూర్తిస్థాయిలో రెగ్యులర్ బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని కోరారు. కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ జెల్లపెల్లి అంజన్న యూనివర్సిటీ నాయకులు వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీ మృతిపై కేసు నమోదు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 26: గోదావరిఖని టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధి జనగామలోని ఓ ఇటుక బట్టీలో పనిచేస్తున్న నిరంజన్‌సింగ్ బోరియా మృతిపై కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

ఒడిస్సాకు చెందిన నిరంజన్ సింగ్ బోరియా నెల రోజుల క్రితం ఇటుక బట్టీలో పనిలో చేరాడు. బుధవారం మధ్యాహ్నం జయకుమార్ అనే తోటి కూలీతో కలసి నదిలో చేపలు పట్టుకుని వంట చేసుకుని తిన్నారు. కాసేపటికి వాంతులు, విరోచనాలు కావడంతో ఇటుక బట్టీ నిర్వాహకులు గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నిరంజన్‌సింగ్ బోరియా బుధవారం అర్ధరాత్రి మరణించాడు. మృతుడి బంధువు దుర్యోదన్ బోరియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఆహారం కలుషితం కావడమే లేక ఇతర కారణాలతో నిరంజన్‌సింగ్ మరణించాడా అనేది విచారణ తర్వాత స్పష్టత వస్తుందని పోలీసులు తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు

జూలపల్లి, సెప్టెంబరు 26. మండల కేంద్రానికి చెందిన అమరగాని చంద్రయ్యగౌడ్ అనే గీత కార్మికుడు ఈతచెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగ గాయపడ్డాడు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వృత్తిలో భాగంగా బుదవారం ఈత చెట్టు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడిపోవడంతో వెన్నుపూసకు దెబ్బ తగిలి తీవ్రగాయాలయ్యాయి. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి ఆదుకోవాలని మండల గీతకార్మిక, గౌడ సంఘం నాయకులు కోరారు.

నేడు విద్యార్థి గర్జన సభ

గణేశ్‌నగర్, సెప్టెంబరు 26: హైదరాబాదులో శుక్రవారం నిర్వహించనున్న విద్యార్థి గర్జనసభ పోస్టర్లను భారత విద్యార్థి ఫెడరేషన్ కరీంనగర్ టౌన్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఆర్ఆర్ కళాశాల వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టౌన్ అధ్యక్షుడు ఎల్కటూరి ఇషాక్ గురువారం మాట్లాడారు. సంక్షేమ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలను మూడువేలకు పెంచాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 16 మండలాలు ఉంటే ఏ ఒక్క మండలానికి కూడా రెగ్యులర్ ఎంఈవో లేని పరిస్థితి ఉందన్నారు. ఇన్‌చార్జి ఎంఈవోలే ఉన్నారన్నారు. ఖాళీగా ఉన్న ఎంఈవో పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాశాల హాస్టల్స్‌లో దాదాపు అద్దె భవనంలో అరకొర వసతులతో అనేక ఇబ్బందులు పడుతూ కొనసాగుతున్నాయన్నారు. నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకి పెరిగిపోతున్నా సంక్షేమ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలను పెంచడం లేదన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ నెల 27న హైదరాబాదులో జరిగే విద్యార్థి గర్జన సభను జయప్రదం చేయాల్సిందిగా విద్యార్థులను మేధావులను కోరారు. ఈ కార్యక్రమంలో విష్ణు, రమేష్, భాను చందు, మర్రి శంకర్, శ్రీను, భారత్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి నదిలో యువకుడి గల్లంతు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 26: గోదావరి నదిలో గురువారం సుదర్శి బాలరాజు(29) అనే తాపీ మేస్త్రీ గల్లంతయ్యాడు. తనతో నిర్మాణ పనులు చేసే ఇద్దరు మేస్త్రీలతో కలసి నదీ స్నానానికి వచ్చాడు. సమ్మక్క గద్దెల సమీపంలో ప్రమాదవశాత్తు బాలరాజు జారి నదిలో పడడంతో కొట్టుకుపోయాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన బాలరాజు కొద్ది కాలంగా స్థానిక కేసీఆర్ కాలనీలో నివాసం ఉంటు స్థానికంగా భవన నిర్మాణ మేస్త్రీగా పనిచేస్తున్నాడు.

మహిళను రక్షించిన అగ్నిమాపక దళ సిబ్బంది



హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 26: మండలంలోని సిర్సపల్లి గ్రామంలో గురువారం మతిస్థిమితం లేని ఓ మహిళ బావిలో దూకగా, అగ్నిమాపకదళ సిబ్బంది కాపాడారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. సిర్సపల్లికి చెందిన మన్యాల శారద మతిస్థిమితం లేక గ్రామంలో పేద బావిలో దూకింది. స్థానికులు వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకొని బావిలోకి దూకి శారదను ప్రాణాలతో కాపాడారు. మహిళను కాపాడిన ఫైర్ సిబ్బంది శ్రీనివాస్, ప్రభాకర్, సందీప్, అనిల్‌కుమార్, శివారెడ్డిలను గ్రామస్థులు అభినందించారు.

ఎస్‌యూలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 26: ఎస్‌యూలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను రెగ్యులర్ చేయాలని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ యూనివర్సిటీ కమిటీ ఆధ్వర్యంలో శాతవాహన యూనివర్సిటీలో ఇన్‌చార్జి వీసీ అధికారి సురేంద్ర మోహన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు కాంపెల్లి అరవింద్ మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీలో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను ఎత్తివేసి రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కిన్నెర క్రాంతి, శివ, ప్రవీణ్, జగన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

29న కొండగట్టులో ఆలయాల అర్చకులకు సన్మానం

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబర్ 26: బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కొండగట్టులోని బృందావనం ఫ్యామిలీ రిసార్ట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, చర్చాగోష్ఠితో పాటు ఉమ్మడి జిల్లాకు చెందిన పలు ఆలయాల అర్చకులకు సన్మానం నిర్వహిస్తున్నట్లు వేదిక వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ ఉజ్వల, రిసార్ట్స్ అధినేత మర్రిపెల్లి కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు బాల శ్రీనివాసులు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తత్వం చారిటబుల్ ట్రస్టు అధినేత బంగారయ్యశర్మ, అతిథులుగా బిర్లామందిర్ ప్రధానార్చకుడు ఎం లక్ష్మీనరసింహాచార్యులు, దర్శనం మాసపత్రిక సంపాదకుడు మారుమాముల వేంకటరమణశర్మ, వేద, పురాణ, ఇతిహాస, ప్రవచన పండితులు పురాణం మహేశ్వరశర్మ, నంబి వేణుగోపాలాచార్యుల కౌశిక, రిసార్ట్స్ ఎండి కొండలరావు, ఏబీ6 న్యూస్ ఛానల్ డైరెక్టర్ విష్ణుదాస్ శ్రీకాంత్ హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ వ్యాపారాలు చేసే బ్రాహ్మణ కుటుంబాల వారిచే స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు, ఔత్సాహికులు సెల్. 7382171021, 9059550280 నెంబర్లలో సంప్రదించాలన్నారు. ఉమ్మడి జిల్లా బ్రాహ్మణ సమాజ బంధువులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయంలో తనిఖీలు

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 26: సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయంలో సివిల్ సప్లయిస్ విజిలెన్స్ ఇన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సిరిసిల్ల నియోజకవర్గం పరిధిలోని వివిధ మండలాల్లో ఇటీవల రేషన్ దుకాణాల డీలర్ల నియామకాల్లో అవకతవకలు జరగాయని సివిల్ సప్లయిస్ కమిషనర్‌కు ఫిర్యాదు రావడంతో కమిషనర్ ఆదేశాల మేరకు అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు తెలిసింది.

ఇసుక లారీల పట్టివేత

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 26: జమ్మికుంట మండలం తనుగుల పరిధిలోని మానేర్ నుండి ఇసుక లోడులతో వస్తున్న నాలుగు లారీలను శంబునపల్లి గ్రామంలో పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ గురువారం రాత్రి పట్టుకున్నారు. లారీలను స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ముగ్గురు డ్రైవర్లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ఇసుక తరలిస్తున్న వాహనం సీజ్

సుల్తానాబాద్, సెప్టెంబర్ 26: సుల్తానాబాద్ మండలంలోని కదంబాపూర్ గ్రామం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఓ వాహనాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు తహసీల్దార్ మధుసూదన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి వద్ద ఓ వాహనంలో సంచుల్లో నింపి ఉన్న బ్యాగులను రవాణా చేస్తుండగా తాము పట్టుకున్నామని ఆయన తెలిపారు. ఈ మేరకు వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మానేరు నుంచి ట్రాక్టర్ల ద్వారా పలు చోట్ల డంపులు ఏర్పాటు చేసుకుని ఆ ఇసుకను జల్లెడ పట్టించి 25 నుంచి 30 కిలోల బ్యాగుల్లో నింపి ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు నిజామాబాద్, వరంగల్ తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారనే విషయం బయటపడిందని తహసీల్దార్ తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు భారీగా వరద

- 22 గేట్లు ఎత్తిన అధికారులు


దిగువకు దూకుతున్న శ్రీరాంసాగర్ నీరు

జగిత్యాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం వరద నీరు భారీగా వస్తోంది. దీంతో ప్రాజెక్టుకు చెందిన 22 వరద గేట్లు ఎత్తి 81,224 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 1,09,214 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

అదుపు తప్పి ఇసుక లారీ బోల్తా

మంథని, సెప్టెంబర్ 26: మున్సిపల్ పరిధిలోని గంగాపురి గ్రామ శివారులో మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి పక్కన ఇసుక లారీ అదుపు తప్పి గురువారం బోల్తా పడింది. మండలంలోని అడవిసోమన్‌పల్లి ఇసుక క్వారీ నుంచి కరీంనగర్‌కు లోడ్‌తో వెళ్తున్న లారీ గంగాపురి సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ మద్యం మత్తులో ఉన్న కారణంగానే ఈప్రమాదం చోటు చేసుకున్నట్లు స్థానికులు వెల్లడించారు. స్థానికులు లారీ క్యాబిన్ చిక్కున్న డ్రైవర్‌ను బయకు తీశారు. డ్రైవర్‌కు స్వల్పంగా గాయాలయ్యాయి.

వాటర్ ట్యాంక్ ఎక్కి పాత రేషన్ డీలర్ల ఆందోళన

సిరిసిల్ల టౌన్, సెప్టెంబరు 26: తమ రేషన్ దుకాణాలు తమకివ్వాలని దాదాపు 30 మంది పాత రేషన్ డీలర్లు గురువారం జిల్లా కేంద్రంలోని సాయినగర్ మున్సిపల్ వాటర్ ట్యాంక్ ఎక్కి ఆందోళన చేపట్టారు. పోలీసులు వాటర్ ట్యాంక్‌పైకి రావాలని చూస్తే ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య చేసుకుంటామని ఇద్దరు మహిళా డీలర్లు హెచ్చరించారు. విషయం తెలుసుకున్న అడి షనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, సిరిసిల్ల తహసీల్దార్ షరీఫ్ అహ్మద్ బుజ్జగించే ప్రయ త్నం చేశారు. కేవలం పాత్రికేయులు పైకి వెళ్లడానికి బాధితులు ఒప్పుకున్నారు. వాటర్ ట్యాంక్‌పైకి చేరిన పాత్రికేయులతో డిమాండ్లను వెల్లడించారు. సిరిసిల్ల నియోజకవర్గంలో సిరిసిల్ల పట్టణం, గంభీరావుపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లో 58 రేషన్ దుకాణాలతో పదేళ్లుగా పనిచేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. తమకు సమాచారం లేకుండా దుకాణాలకు నోటిఫికేషన్ వేశారన్నారు. అనర్హులకు అధికార పార్టీ నాయకులు, అధికారులు రేషన్ దుకాణాలను ఇస్తున్నారని ఆరోపించారు. డబ్బులు తీసుకొని ఇచ్చి తమకు అన్యాయం చేశారని పాత మహిళా డీలర్లు కన్నీరు పెట్టుకున్నారు. డబ్బుల కోసమే తమ రేషన్ దుకాణాలను తమకుకాకుండా చేస్తే ఆ నాయకులకు, ఆ అధికారులకు బిచ్చమెత్తైన డబ్బులు ఇస్తామని, దుకాణాలు ఇవ్వండని వేడుకున్నారు. కలెక్టర్ స్పందించి తమ దుకాణాలు తమకివ్వాలన్నారు. కలెక్టర్, ఆర్డీవోతో మాట్లాడతామని పోలీసు అధికారులు, తహసీల్దార్ నచ్చజెప్పడంతో వాటర్ ట్యాంక్ దిగి వచ్చారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.


వాటర్ ట్యాంక్ ఎక్కి ఆందోళన చేస్తున్న పాత రేషన్ డీలర్లు, పెట్రోల్ బాటిల్‌తో పాత మహిళ రేషన్ డీలర్లు

మాజీ మంత్రి కేటీఆర్‌కు గోడు వెళ్లబోసుకున్న బాధితులు

- మంత్రి ఉత్తమ్‌కు ఫోన్

సిరిసిల్ల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రేషన్ దుకాణాల కేటాయింపు వివాదం చర్చనీయాంశంగా మారింది. 54 దుకాణాలకు సంబంధించి రాత పరీక్షలు నిర్వహించి, ఇంటర్వ్యూలు జరిపినా కేవలం కాంగ్రెస్ సంబంధిచిన వారికే అడ్డదారిన ఇచ్చారనే దానిపై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో గురువారం జిల్లాకు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావుకు బాధితులు గోడు వెళ్లబోసుకన్నారు. సిరిసిల్లలోని జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బాధితులు కేటీఆర్‌ను కలుసుకున్నారు. గతంలో మహిళ సంఘాల ద్వారా నిర్వహించిన వాటిని తొలగించిన విషయంతో పాటు అర్హతలు లేనివారికి కేటాయించడం ఇతర అవకతవకలను కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై కేటీఆర్ పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఫోన్ చేసి జరిగిన అవకతవకలపై వివరించారు. ఉత్తమ్ కుమార్‌రెడ్డి పరిశీలిస్తామని చెప్పారు. కేటీఆర్ సిరిసిల్ల ఆర్డీవోకు ఫోన్ చేయగా ఆయన ఫోన్ ఎత్తలేదు. ఆర్డీవో కార్యాలయంలోనే రేషన్ దుకాణాలపైనే విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలపై మాజీ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ రెండు రోజుల క్రితం ఫిర్యాదు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. దానిపై కేటీఆర్ బాధితులతో హైకోర్టులో పిటిషన్ వేసే విషయంపై చర్చించారు. న్యాయ పోరాటం చేస్తామని ఎవరినీ వదిలేదిలేదని తెలిపారు. ధైర్యంగా ఉండాలని సూచించారు.


కేటీఆర్‌కు సమస్యను చెప్పుకుంటున్న బాధితులు

రామగుండం ఎన్టీపీసీకి మూడు జాతీయ స్థాయి అవార్డులు

- ఇంధన పొదుపు, పవర్ ఎక్స్‌లెన్స్‌లో ఎకనామిక్ టైమ్స్ నుంచి పురస్కారం

జ్యోతినగర్, సెప్టెంబరు 26: రామగుండం ఎన్టీపీసీకి ఎనర్జీ కన్‌జర్వేషన్(ఇంధన పొదుపు), పవర్ ఎక్స్‌లో మూడు జాతీయ స్థాయి అవార్డులు లభించాయి. ప్రముఖ పబ్లికేషన్స్ సంస్థ ది ఎకనామిక్ టైమ్స్ ప్రతి ఏటా విద్యుత్ సంస్థలకు అవార్డులను అందజేస్తున్నది. దీనిలో భాగంగా బుధవారం రాత్రి ఢిల్లీలో జరిగిన ఎకనామిక్ టైమ్స్ ఎనర్జీ లీడర్‌షిప్ అవార్డ్స్ 2024 కార్యక్రమంలో రామగుండం ఎన్టీపీసీకి అందజేసింది. ఇంధన ఎదుపు అవార్డు(ఇండస్ట్రీస్), ఎనర్జీ కంపెనీ అవార్డు(పవర్), ఎనర్జీ కంపెనీ అవార్డులను(రిన్యూవబుల్) కేంద్ర ఇంధన శాఖా క్యాబినేట్ మంత్రి ప్రహ్లాద్ జోషి రామగుండం ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాడుకు అందజేశారు. విద్యుత్ రంగంలో ఘనసీయమైన చరిత్ర ఉన్న రామగుండం ఎన్టీపీసీకి మరోసారి జాతీయస్థాయి పురస్కారాలు రావడంపట్ల ప్రాజెక్టులో హర్షం వ్యక్తం అవుతున్నది. నాలుగున్నర దశాబ్దాలుగా ప్రాజెక్టు పలు రంగాల్లో అత్యుత్తమంగా పని చేయడం ద్వారా అనేక బెంచ్‌మార్కులను, రికార్డులను నమోదు చేసింది. ఇంధన పొదుపు, జనరేషన్, సాంప్రదాయేతర విద్యుత్, పర్యావరణం తదితర రంగాల్లో అవార్డులు సాధిస్తున్నది.



అవార్డు అందుకుంటున్న ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు

3 నుంచి రాజన్న ఆలయంలో దేవీ నవరాత్రోత్సవాలు

- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు


విగ్రహాలను శుద్ధి చేస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, సెప్టెంబరు 26 : వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో అక్టోబరు 3వ తేది శనివారం నుంచి దేవీనవరాత్రోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా రాజన్న ఆలయంలో గురువారం శ్రీదేవీనవరాత్రోత్సవాలకు మండపం ఏర్పాట్లు చేస్తున్నారు. రాజన్న ఆలయంలో శ్రీదేవీనవరాత్రోత్సవాలు అక్టోబరు 3వ తేది శనివారం నుంచి 12వ తేది శనివారం వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. 9వ తేది బుధవారం రోజున ఉదయం 9 గంటలకు మూలా నక్షత్ర పుస్తకరూపిణి మహాసరస్వతి పూజ, 10 తేది గురువారం రోజున దుర్గాష్టమిని పురస్కరించుకుని ఉదయం 8.30 గంటలకు నుంచి చండీ అమ్మవారి వద్ద శ్రీచండీకలశప్రతిష్ఠ, చండీ సప్త శతీ హవనము చేపట్టగా రాత్రి 8 గంటలకు శ్రీమహిషాసురమర్దినీ అమ్మవారికి మహాపూజ జరగనున్నాయి. 11వ తేది శుక్రవారం రోజున ఉదయం 11.05 గంటలకు పూర్ణహుతి, బలిహరణ రాత్రి 8.30 గంటలకు నుండి అమ్మవారిక ధర్మగుండంలో తెప్పోత్సవము నిర్వహించనున్నారు. 12వ అది శనివారం రోజు విజయదశమి (దసరా)ను సందర్భంగా ఉదయం 10.45 గంటలకు ఆలయుధపూజ, సాయంత్రం 5 గంటలకు నుంచి స్వామి వారి పెద్దసేవ (అంబారీ సేవ)ను, స్వామి వారి అమ్మవార్ల శమీపూజ, అపరాజిత పూజ చేపట్టానున్నారు. శ్రీదేవీనవరాత్రోత్సవాలతో ప్రతినిత్యం సాయంత్రం 4 గంటలకు శ్రీమత్ దేవీభాగవత పురాణ ప్రవచనము నిర్వహించడంతో పాటు స్వామి వారికి నిత్య కల్యాణం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

రోగి బంధువుపై ఆసుపత్రి సిబ్బంది దాడి?

- కలెక్టర్‌తో పాటు పోలీస్, వైద్య శాఖ అధికారులకు ఫిర్యాదు

జగిత్యాల, సెప్టెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధాన వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఓ రోగి బంధువుపై ఆసుపత్రి సిబ్బంది దురుసుగా ప్రవర్తించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో గురువారం వెలుగులోకి వచ్చింది. జిల్లా కేంద్రానికి చెందిన కుందారపు గంగాధర్ అనారోగ్యానికి గురి కావడంతో అతని కుమారుడు నరేష్ జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం చేర్పించాడు. చికిత్స అందించే విషయంలో వైద్యులతో పాటు సిబ్బంది అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తున్నారనే ఆరోపణతో నరేష్ పలు ఘటనలను తన ఫోన్‌లో వీడియో ద్వారా బుధవారం రాత్రి చిత్రీకరించాడు. దీంతో సదరు వీడియోలను డిలీట్ చేయాలని కోరుతూ కింది స్థాయి సిబ్బంది ఒకరు నరేష్‌పై దాడికి పాల్పడ్డట్లు బాధితుడు కలెక్టర్‌తో పాటు పోలీస్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు పిర్యాదు చేశాడు. ఈ ఘటనపై ఆసుపత్రి సూపరింటెండెంట్ రాములును వివరణ కోరగా ఫిర్యాదు అందిన విషయం వాస్తవమేనని, ప్రాథమికంగా విచారణ చేశామని, రోగి బంధువు, సంబంధిత సిబ్బంది మధ్య పాత గొడవలున్నట్లుగా తెలుస్తోందని స్పష్టం చేశారు. మరింత లోతుగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఎఫ్‌టీఎల్‌లోని కట్టడాలకు కార్పొరేషన్ అధికారుల నోటీసులు

- తమ తప్పేమిలేదంటున్న నిర్మాణదారులు

కోల్‌సిటీ, సెప్టెంబరు 26: రామగుండం నగరపాలక సంస్థ 5వ డివిజన్ పరిధిలోని మల్లపురాణికుంట ఎఫ్‌టీఎల్‌లో 16 భవనాలకు గురువారం నగరపాలక సంస్థ అధికారులు నోటీసులు జారీ చేశారు. అదనపు కలెక్టర్(రెవెన్యూ) ఆదేశానుసారం నోటీసులు ఇస్తున్నట్టు పేర్కొన్నారు. ఇటీవల రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు సంయుక్త సర్వే చేసి మల్లపురాణికుంటకు శిఖం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను నిర్ధారించారు. 16 నిర్మాణాలు ఎఫ్‌టీఎల్‌లో ఉండగా 36 నిర్మానాలు శిఖంలో ఉన్నాయి. శిఖంలో ఉన్న నిర్మాణాలను తొలగించుకోవాలని ఇప్పటికే కార్పొరేషన్ సమాచారం ఇచ్చింది. గురువారం ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలకు నోటీసులు ఇచ్చారు. కాగా బఫర్ జోన్‌లో కూడా చాలా నిర్మాణాలు ఉన్నాయి. ఎఫ్‌టీఎల్‌లోని నిర్మాణాలకు నోటీసులు ఇవ్వగా వినాయకనగర్ వాసులు కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్ అధికారులను సంప్రదించారు. తాము నిర్మించుకున్న నివాసాలకు గతంలో రెవెన్యూ నాలా కన్వర్షన్ ఇచ్చిందని, ఇరిగేషన్ ఎన్‌ఓసీలు ఇచ్చిందని, మున్సిపల్ కార్పొరేషన్ పర్మిషన్లు ఇచ్చిందని, అలాంటప్పుడు మా తప్పు ఎలా అవుతుందంటూ పేర్కొన్నారు. కాగా నోటీసులకు రాతపూర్వక సమాధానం ఇవ్వాలని, తాను అధికారులకు నివేదిస్తానని టీపీఎస్ నవీన్, నిర్మాణదారులతో పేర్కొన్నారు. కాగా మల్లపురాణికుంట శిఖం భూముల్లోని నిర్మాణదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల జిల్లా ఉన్నతాధికారులు నగరంలోని పలు ప్రాంతాల్లో నాలా ఆక్రమణలు, చెరువుల ఆక్రమణలపై పరిశీలన జరిపారు. త్వరలోనే యాక్షన్ ప్లాన్ చేపడుతారనే ప్రచారం జరుగుతున్న సందర్భంలో నోటీసులు కలకలం రేపాయి. వినాయక నగర్ ఎఫ్‌టీఎల్ నిర్మాణ బాధితుల్లో పోలీస్‌శాఖకు చెందిన పలు కుటుంబాలు ఉన్నాయి.


కార్పొరేషన్ టీపీఎస్‌తో మాట్లాడుతున్న వినాయకనగర్ వాసులు

జెన్‌కో ద్వారానే విద్యుత్‌కేంద్రం నిర్వహించాలి

గణేశ్‌నగర్, సెప్టెంబరు 26: సింగరేణికి నూతన ప్రాజెక్టులో భాగస్వామ్యాన్ని వ్యతిరేకిస్తూ, జెన్‌కో ద్వారానే విద్యుత్ కేంద్రం నిర్మించాలని తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్ సర్కిల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామగుండంలో జెన్‌కో ద్వారా నిర్వహించిన 62.5 మెగావాట్ల పాత థర్మల్ విద్యుత్ కేంద్రం మూసివేయడానికి నిర్ణయించారన్నారు. దాని స్థానంలో నూతనంగా 800 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సింగరేణి, జన్‌కో భాగస్వామ్యంతో నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. నూతన విద్యుత్ కేంద్రాన్ని పూర్తిగా జెన్‌కో ఆధ్వర్యంలో నిర్మించాలని ఉద్యోగ,కార్మిక సంఘాలు కోరుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులందరూ నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో కరీంనగర్ జేఏసీ నాయకులు నాయిని అంజయ్య, వీరయ్య, సంపత్ కుమార్, శ్రీనివాస్, జనార్దన్, స్వామి, సుధీర్ కుమార్, కిరణ్ ఇతర నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న విద్యుత్ జేఏసీ నాయకులు

కొత్త చెరువు నాలాలపై ఆక్రమణలను తొలగించాలి

సిరిసిల్ల టౌన్, సెప్టెంబర్ 26 : సిరిసిల్ల కొత్త చెరువు నాళాలు, శాంతినగర్ రోడ్డం ఆక్రమణాలను తొలగించాలని గురువారం ఏఐఎఫ్టీయూ(న్యూ)నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎఫ్టీయూ(న్యూ)రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సోమిశెట్టి దశరథం మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలో కొత్త చెరువుకు సంబంధించిన నాళాలు, రొడ్డం 16 సంవత్సరాలుగా ఆక్రమణాలకు గురవుతున్నాయన్నారు. తెలంగాణ రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు రవీందర్, ఎర్రజెండా పవర్ లూం కార్మిక సంఘం జిల్లా నాయకుడు బొద్దుల శ్రీహరి, పట్టణ నాయకులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

క్రైం కార్నర్

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

కొడిమ్యాల, సెప్టెంబరు 26: మండలంలోని సూరంపేట గ్రామానికి చెందిన నక్క సాయి(25)మద్యానికి బానిసై గురువారం తెల్లవారుజామున ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు సాయి మద్యానికి బానిసయ్యాడు. దీంతో పాటు ఆర్థిక సమస్యలు ఏర్పడటంతో అతడి భార్య ఏడాది క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయింది. అనస్థాపానికి గురైన సాయి ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. సాయి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ట్లు ఎస్సై వివరించారు. ఇదిలా ఉండగా తన చావుకు ఎవరూ కారణం కాదని, మద్యానికి బానిసై అందరినీ బాధపెట్టానని తనను క్షమించాలని రాసిన సూసైడ్ నోట్ ఇంట్లో లభించింది.

కారు కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య

జగిత్యాలరూరల్, సెప్టెంబరు 26: కారుకొనివ్వలేదని ఇంట్లోనుంచి పారిపోయి వచ్చి యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ గ్రామశివారులో చోటుచేసుకుంది. జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండలం రాగిల్ల గ్రామానికి చెందిన దేతపు వంశీ (20) కారు కొనివ్వాలని ఇంట్లో తరచూ తల్లిదండ్రులను అడిగేవాడు. కారు కొనివ్వకపోవడంతో వంశీ మనస్తాపానికి గురయ్యాడు. ఈక్రమంలో ఈనెల 23న ఇంటి నుంచి వెళ్లిన వంశీ కనిపించకుండా పోయాడు. గురువారం జగిత్యాల రూరల్ మండలంలోని లక్ష్మీపూర్ శివారులోని గుట్టప్రాంతంలో వంశీ చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించడంతో విషయం తెలిసింది. మృతుడి తండ్రి రాజలింగు ఫిర్యాదు మేరకు కేసు ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

అదుపు తప్పిన ద్విచక్ర వాహనం

- ఒకరికి తీవ్రగాయాలు

ముత్తారం, సెప్టెంబర్ 26: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా వెళ్తున్న ద్విచక్ర వాహనానికి ఒక్కసారిగా కోతి అడ్డం రావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. కమాన్‌పూర్ మండలానికి చెందిన బూడ రాజు అనే వ్యక్తి ముత్తారం మండల కేంద్రంలో విద్యుత్తు లైన్ల సవరణలో కాంట్రాక్టు లేబర్‌గా విధులు నిర్వహించి తిరుగు ప్రయాణంలో ఇంటికి వెళ్తుండగా ఈ సంఘటన జరిగిందని బాధితుడు తెలిపాడు. తలకు తీవ్రగాయాలు కాగా అక్కడే ఉన్న కానిస్టేబుల్, స్థానికులు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హత్యాయత్నం కేసులో ముగ్గురికి మూడేళ్ల జైలు

సిరిసిల్ల క్రైం, సెప్టెంబరు 26: హత్యాయత్నం కేసులో ముగ్గురు రౌడీ షీటర్లకు మూడేళ్ల జైలు శిక్ష, రూ. 1000జరిమానా విధిస్తూ సిరిసిల్ల అసిస్టెంట్ సబ్ కోర్టు న్యాయమూర్తి రాధికా జైస్వాల్ గురువారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం.... చందుర్తి మండలంలోని అశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన అంచ రాంరెడ్డి అనే వ్యక్తికి అదే గ్రామానికి చెందిన కట్కూరి స్వామి, గంగుల శ్రీను, చింత శేఖర్‌లకు బావి పంచాయతీ విషయంలో తరుచు గొడవలు తలెత్తాయి. ఈ గొడవల్లో భాగంగా రాంరెడ్డిని చంపాలనే ఉద్దేశ్యంతో స్వామి, శ్రీను, శేఖర్‌లు కర్రతో దాడిచేశారు. ఈ దాడిపై బాధితుడు రాంరెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు మేరకు అప్పటి చందుర్తి ఎస్ఐ నీలం రవి కేసు నమోదుచేసి కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో సిఎంఎస్ ఎస్ఐ రవిందర్‌నాయుడు ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్‌లు తిరుపతి, లతీఫ్, సిఎంఎస్ హెడ్‌కానిస్టేబుల్ శంకరయ్య, కానిస్టేబుల్ మధులు 11మంది సాక్షులను ప్రవేశపెట్టగా పిపి వేముల లక్ష్మీప్రసాద్ వాదించగా కేసు పూర్వపరాలు పరిశీలించిన అసిస్టెంట్ సబ్‌కోర్టు న్యాయమూర్తి రాధిక జైస్వాల్ నిందితులపై నేరం రుజువు కావడంతో ముగ్గురికి ఒక్కొక్కరికి మూడేళ్ల జైలు శిక్ష, రూ. 1000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

సింగరేణి కార్మికుడి ఆత్మహత్యాయత్నం

కోల్‌సిటీ, సెప్టెంబరు 26: గోదావరిఖని గాంధీనగర్‌లో పొరిగింటివారితో వివాదం కారణంగా కొరె శంకర్ అనే సింగరేణి కార్మికుడు గురువారం సాయంత్రం విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పొరిగింటి వారితో వివాదంలో మహిళ శంకర్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. శంకర్ కూడా ఆమెపై ఫిర్యాదు చేశాడు. ఈ వివాదంలో మనస్తాపం చెంది ఆత్మహత్యాయత్నం చేసినట్టు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

పనిలో నుంచి తొలగించారని మెడికల్ కళాశాల కార్మికుడు..

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 26: తనపై అకారణంగా కేసు పెట్టి విధుల నుంచి తొలగించారంటూ గోదావరిఖనిలోని సింగరేణి మెడికల్ కళాశాలలో గురువారం మసూద్ అనే కార్మికుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కాంట్రాక్టర్ తరుణ్ మెడికల్ కళాశాలకు రాగా మసూద్ అతనితో వాగ్వాదానికి దిగి విషం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అతడు గోదావరిఖని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

గంజాయి పట్టివేత: నలుగురు నిందితుల అరెస్టు


నిందితుల అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 26: కరీంనగర్ శివారులోని రేకుర్తిలో గురువారం నిర్వహించిన దాడుల్లో 223 గ్రాముల నిషేధిత గంజాయి పట్టుబడిందని కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ నాగేశ్వర్‌రావు తెలిపారు. ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో ఈ దాడులు నిర్వహించగా నలుగురు నిందితులు పట్టుబడ్డారని తెలిపారు. గంజాయి, రెండు మొబైల్ ఫోన్లను సీజ్ చేశామన్నారు. చింతకుంటకు చెందిన నెలమడుగు హరీష్, ధర్మారం రవి, చొప్పదండి మండలం భూపాలపట్నంకు చెందిన మాచర్ల రవితేజ, రేకుర్తి గ్రామానికి చెందిన షేక అఫ్జల్‌పై కేసు నమోదు చేసి, అరెస్టు చేశామన్నారు. దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్లు ఖాసీంబి, కమలాకర్, సంతోష్, కమాలుద్దీన్ పాల్గొన్నారు.

హై వోల్టేజీతో గృహోపకరణాలు దగ్ధం

కోల్‌సిటీ, సెప్టెంబరు 26: విద్యుత్‌లైన్లపై చెట్ల కొమ్మలు తొలగించడంలో ఎన్‌పీడీసీఎల్ నిర్లక్ష్యం కారణంగా రెండు రోజుల క్రితం ఎఫ్‌సీఐ గౌతమినగర్ చిల్డ్రన్స్ పార్క్ ఏరియాలో హై వోల్టేజీ సరఫరా అయ్యింది. దీంతో 24 ఇళ్లలోని టీవీలు, ఫ్రిడ్జ్‌లు, ఇతర విలువైన గృహోపకరణాలు కాలిపోయాయి. గౌతమినగర్ హౌసింగ్ సొసైటీలో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లు ఉండగా చెట్ల కొమ్మలతో వైర్లు తగులుతున్నాయని తాము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఎన్‌పీడీసీఎల్ సిబ్బంది పట్టించుకోలేదని గౌతమినగర్ వాసులు ఆరోపిస్తున్నారు. పైగా హై వోల్టేజీతో నష్టం జరిగితే కోతులపై నెపం నెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఎన్‌పీడీసీఎల్ అధికారులు జోక్యం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు నష్టపరిహారం ఇచ్చేలా చూడాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎలిగేడు, సెప్టెంబరు 26: మండలంలోని ధూళికట్ట గ్రామానికి చెందిన మారం సతీష్(34)అనే యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడని జూలపల్లి ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. సతీష్ ఈనెల 22న బిల్డింగ్ మెట్ల పైనుంచి ప్రమాదవశాత్తు కాలుజారీ కిందపడ్డాడు. తలకు బలమైన దెబ్బ తగిలి ముక్కు, చెవుల నుంచి రక్తం కారింది. గమనించిన అతడి భార్య మధవి కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. అతని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు.


కోరుట్లలో నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కాంగ్రెస్ నాయకులు


డీపీవో కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న ఎస్పీ


కలెక్టర్ కార్యాలయంలో..


మల్యాలలో పూలమాలలు వేస్తున్న నాయకులు


మోరపల్లిలో నివాళులు అర్పిస్తున్న నాయకులు


నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు


పూలమాల వేస్తున్న కొప్పుల ఈశ్వర్

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటి చెప్పిన వీరనారి చాకలి ఐలమ్మ అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పలు చోట్ల గురువారం చాకలి ఐలమ్మ జయంతి వేడులకను రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తెలంగా ణ రైతాంగ సాయుధ పోరాటంలో చాకలి ఐలమ్మ రగిలించిన స్ఫూర్తిని భావి తరాలకు చాటి చెప్పేందుకు నేటి మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్లేలా మహిళ యూనివర్సిటీకి సీఎం రేవంత్‌రెడ్డి చాకలి ఐలమ్మ యూనివర్సిటిగా నామకరణం చేయడం హర్షణీయమని మహిళల పక్షాన లక్ష్మణ్‌కుమార్ సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలంగాణ ఉద్యమ పోరాటానికి స్ఫూర్తి చాకలి ఐలమ్మ అని మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. అల్లీపూర్ గ్రామంలో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్


చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్


మెట్‌పల్లిలో పూలమాల వేస్తున్న రజక సంఘం నాయకులు


అల్లీపూర్‌లో నివాళులర్పిస్తున్న మాజీ జడ్పీ చైర్ పర్సన్


భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామంలో


ఇటిక్యాలలో ఐలమ్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న నాయకులు


బర్తీపూర్‌లో చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

మెట్‌పల్లి టౌన్, సెప్టెంబరు 26: మెట్‌పల్లి పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కారించాలని కోరుతూ గురువారం పట్టణ కాంగ్రెస్ నాయకులు, మాజీ కౌన్సిలర్ ఎండీ షకీర్ రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. పట్టణంలోని ప్రభుత్వ అసుపత్రిలో గైనకాలజిస్ట్, ఎంఎస్, ఎండి డాక్టర్లు లేక అసుపత్రికి వచ్చే ప్రజలు చాల ఇబ్బంది పడుతున్నారని వెంటనే వైద్యులను నియామించాలని కోరారు. పోలీస్ స్టేషన్‌లో సిబ్బంద కొరత తీవ్రంగా ఉందాని సిబ్బందిని నియమించాలని అయన మంత్రికి విన్నవించారు.

ఏబీవీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం

ధర్మపురి, సెప్టెంబరు 26: ధర్మపురి పట్టణంలో ఏబీవీపీ ముఖ్య కార్యకర్తల సమావేశం గురువారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా విభాగ్ సంఘటన మంత్రి రామకృష్ణ, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మల్యాల రాకేష్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ ఏబీవీపీ 1949 జూలై 9 న ఢిల్లీ కేంద్రంగా ప్రారంభమై జాతీయవాద సిద్ధాంతాలతో ఎంతో మంది విద్యార్థులను జ్ఞాన శీల ఏకత సాధనల కోసం జాతీయ పునర్నిర్మాణం కోసం పని చేసే విదంగా ప్రేరేపించిందన్నారు. అనంతరం జిల్లా కన్వీనర్ మ్యా డవేని సునీల్ కార్యవర్గాన్ని ప్రకటించారు. నూతన నగర కార్యదర్శిగా నరెడ్ల విఘ్నేష్, ఉపాధ్యక్షులుగా గణేష్, అఖిలేష్, శివకు మార్, నగర సంయుక్త కార్యదర్శులుగా నరేందర్, సాయిదీప్, లోకేష్‌లను నియమించారు

సమాజ భాగస్వామ్యంతో ప్రభుత్వ బడులు బలోపేతం

వెల్గటూర్, సెప్టెంబరు 26: సమాజ భాగస్వామ్యంతోనే ప్రభుత్వ బడులు బలోపేతం అవుతాయని జిల్లా సెక్టోరల్ అధికారి కొక్కుల రాజేష్ పేర్కొన్నారు. గురువారం జగదేవ్‌పేట పరిధిలోని అంబేద్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో స్థానిక కానిస్టేబుల్ బచ్చల రాజేష్ దాతృత్వంలో విద్యార్థులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. ఎంఈవో ప్రభాకర్ మాట్లాడుతూ దాతల సేవలను స్ఫూర్తిగా తీసుకొని సేవా భావాన్ని పెంపొందించుకో వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు నందయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఏఏపీ చైర్మన్ హఫీజా, ఉపాధ్యాయుడు రవి, సీఆర్పీ వెంకటేష్, సుధాకర్ పాల్గొన్నారు.

'నిత్యావసర సరుకులు అందించడం అభినందనీయం'



నిత్యవసర వస్తువులను అందిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

కోరుట్ల, సెప్టెంబరు 26 : నిరుపేదలకు నిత్యవసర సరుకులు అందించడం అభినందనీయమని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 320 జిల్లా గవర్నర్ నడిపెల్లి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం కోరుట్ల పట్టణ లయన్స్ క్లబ్, కోటి నవదుర్గ మహిళ లయన్స్ క్లబ్ సభ్యుల ఆధ్వర్యంలో సుమారు రూ. 1.20 లక్షల విలువ గల నిత్యావసర వస్తువులను లయన్స్ క్లబ్ రెండ వ గవర్నర్ మోర బద్రేశం తో కలిసి 40 మంది నిరుపేదల కు క్లబ్ సభ్యులతో కలిసి వెంకటేశ్వరరావు అందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు వాలేటి శ్రీనివాస్ రావు, పోతని ప్రవీణ్, అడెపు కమల-మధు, అల్లాడి ప్రవీణ్, చాప కిశోర్-వందన, మహేందర్, నరేంద్ర పోలాస గీత, రవి, వనపర్తి చంద్రం, కొండబత్తిని కృష్ణలతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఐఎంఏ నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక


డాక్టర్ రేకోండ రాజేష్


డాక్టర్ కటకం జగదీశ్వర్


డాక్టర్ అన్వేష్

కోరుట్ల, సెప్టెంబరు 26 : పట్టణ ఐఎంఏ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎంపిక జరిగినట్లు ఐఎంఏ సభ్యులు గురువారం తెలిపారు. పట్టణ అధ్యక్షుడుగా డాక్టర్ రేకోండ రాజేష్, ప్రదాణ కార్యదర్శిగా కటకం జగదీ శ్వర్, కోశాధికారిగా డాక్టర్ అన్వేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. నూతనంగా ఎంపికైన కార్యవర్గాన్ని ఐఎంఏ రాష్ట్ర నాయకుడు డాక్టర్ అనూప్‌రావు ఆధ్వర్యంలో సన్మానించి అభినందించారు. నూతనంగా ఎంపికైన సభ్యులు మాట్లాడుతూ తన నిమయాకంకు సహా కారం అందించిన సీనియర్, జూనియర్ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లాలో ఇద్దరు ఎస్సైలపై వేటు..?

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 26 : జగిత్యాల జిల్లా పనిచేస్తున్న ఇద్దరు ఎస్సైలపై ఉన్నతాధికారులు వేటు వేసినట్లు తెలిసింది. రాయికల్ ఎస్సైగా పనిచేస్తున్న ఎస్సై అశోక్ క్రమ శిక్షణ చర్యలు ఉల్లంఘనలో భాగంగా సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు సమాచారం. అలాగే జగిత్యాల జిల్లా కేంద్రంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన బొల్లారపు శివ ప్రసాద్ అనే యువకుడు కోరుట్ల ఎస్సై శ్వేత దాడి చేయడంతోనే ఈ నెల 23న ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డ విషయంలో ఘటనకు కారణంగా భావిస్తూ ఎస్పీకి అటాచ్ చేసినట్లు సమాచారం.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షమీంసుల్తానా

మెట్‌పల్లి రూరల్, సెప్టెంబరు, 26 : వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించినప్పుడే సంపూర్ణ ఆరోగ్యం ఉంటారని ఐసీడీఎస్ సూపర్ వైజర్ షమీంసుల్తానా అన్నారు. పోషణ్ మాసోత్సవాల సందర్భంగా గురువారం మండలంలోని ఆత్మనగర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు, మహిళలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహనతో పాటు కిచెన్ గార్డెన్ ప్రాముఖ్యత, విద్యకు సంబంధించిన ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లులు పిల్లలకు తినిపించే ఆహారంలో విటమిన్లు, ప్రొటీన్లు, కొవ్వులు, పిండి పదార్థులు అన్ని ఉన్నాయా లేదా అని చూసుకోని పౌష్టికాహారం అందించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపైనే ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులు రేఖ, శ్రీలత, స్నేహ, కవిత, లత, ఏఎన్‌ఎం వసంత, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, నాగమణి, పాల్గొన్నారు.


పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షమీంసుల్తానా

చిన్నారులకు పోషకాహారం అందించాలి

రాయికల్: చిన్నారులకు తల్లిదండ్రులు పోషకాహారంతో కూడిన ఆహారాన్ని అందించాలని రాయికల్ ఎంపీడీవో చిరంజీవి అన్నారు. మండలంలోని ఇటిక్యాల గ్రామంలో గల గుడేటిరెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఇటిక్యాల సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణ అభియాన్ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఎంపీడీవో మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. గర్భిణులకు సీమంతం, పిల్లలకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో మమత, ఏపీఎం చక్రవర్తి శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ సామల్ల లావణ్యవేణు, నాయకులు ఆదిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ ఉమ, మహిళా సంఘం సీసీ గంగమణి పాల్గొన్నారు.

కోరుట్ల రూరల్ : గర్భిణులు ప్రతి రోజు అంగన్ వాడి కేంద్రంలో అందించు సంపూర్ణ బోజనంను సద్వినియోగం చేసుకోని ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ సీహెచ్ రాధిక అన్నారు. గురువారం మండలంలోని అయిలాపూర్ గ్రామంలోని గ్రామ పంచాయితీ సమావేశ మందిరంలో పోషణ మాసం కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు పౌష్టిక ఆహారంపై విలువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలాస అగ్రికల్చర్ ట్రైనీ విద్యార్థులు గర్భిణులకు పెరటి తోట పెంపకం గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యధర్శి నవీన్, అంగన్‌వాడి టీచర్లు విమల, రాజమణి, కాలేశ్వరి, మంజుల, శైలజ, సుజాత, బాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండేది బీఆర్‌ఎస్ నాయకులే

కోరుట్ల, సెప్టెంబరు 26 : ప్రజలకు అందు బాటులో ఉండి సేవలు అందిచేంది బీఆర్ఎస్ నాయకులేనని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. గురువారం పట్టణంలోని 30వ వార్డు కౌన్సిలర్ సజ్జు కాంగ్రెస్ పార్టీ నుండి బీఆర్ఎస్ పార్టీలో చేరగా పార్టీ కండవా కప్పి ఆహ్వానించారు. పట్టణ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కోరుట్ల నియోజకవర్గంను అన్ని రంగాలలో అభివృద్ధి దిశగా ఉంచామని, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ సం జయ్ కూడ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తాడని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీ చైర్మెన్ సింగిరెడ్డి నారాయ ణరెడ్డి, కౌన్సిలర్ సత్యం, సర్పంచ్‌ల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు రాజేష్, సర్పంచ్‌లు బాస్కర్ రెడ్డి, పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 26 :కుటుంబ కలహాలతో మనస్థాపం చెంది ఈ నెల 23న ఆత్మహత్యాయత్నానికి పాల్పడి హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బొల్లారపు శివ ప్రసాద్ (35) అనే యువకుడు గురువారం రాత్రి మృతి చెందాడు. చింతకుంట వాడకు చెందిన శివప్రసాద్‌కు భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొన్ని రోజులుగా దంపతుల మధ్య కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. తీవ్ర మనస్థాపానికి గురైన శివప్రసాద్ గత 23న ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. చికిత్స పొందుతూ మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం నింపింది.

కేసీఆర్ హయాంలో రాయికల్ మండల అభివృద్ధి

రాయికల్, సెప్టెంబరు 26: గత కేసీఆర్ ప్రభుత్వ హాయాంలోనే ఎమ్మెల్సీ కవిత సహకారంతో రాయికల్ మండల అభివృద్ధి జరిగిందని మండల బీఆర్ ఎస్ నాయకులు పేర్కొన్నారు. రాయికల్ పట్టణంలో గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ద్వారా ఎమ్మెల్సీ కవిత సంపూర్ణ సహకారంతో అభివృద్ధి సాధ్యమైందని, నిధులు సాధించడం కవిత వంతు అయితే శిలాఫలకాలు వేయడం ఎమ్మెల్యే సంజయ్ కుమార్ వంతు అయిందన్నారు. రాజ్యసభ సభ్యులుగా పార్లమెంట్‌లో ప్రాతినిత్యం వహిస్తున్న దీవకొండ దామోదర్ రావును గతంలో ఎమ్మెల్సీ, భారత జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాయికల్ మండల అభివృద్ధి కోసం ఎంపీ నిధులు కేటాయించాలని కోరగా మైతాపూర్ గ్రామానికి రూ.25 లక్షలు కేటాయించారన్నారు. దీనిలో భాగంగా ఇటీవల పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా విభాగం అధ్యక్షు రాలు స్పందన, మాజీ ఏఎంసీ చైర్మన్ ఎలుగందుల ఉదయశ్రీ, మండల సమన్వయ కమిటీ సభ్యులు బర్కం మల్లేశ్, కొల్లూరి వేణు, కంటె గంగారాం, మైతాపూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు శివనీతి గంగారెడ్డి, అల్లీపూర్ మాజీ ఉప సర్పంచ్ సాగర్ రావు, మండల నాయకులు సోమన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మెట్‌పల్లి టౌన్, సెప్టెంబరు26: స్వచ్చత హీ సేవ 2024-25 కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని బ్రూక్లీన్ పాఠశాలలో 600 మంది విద్యార్థులతో ఎంసీఎం 2024, ఎస్‌హెచ్‌ఎస్ ఆకృతి ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. మున్సిపల్ కమిషనర్ టి.మోహన్ ఆదేశాల మేరకు పట్టణంలోని బ్రూక్లీన్ పాఠశాలలో విద్యార్థులకు అవగహన కల్పించారు. ఈ సందర్బంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు తడి చెత్త, పొడి చెత్త వేర్వేరుగా ఇవ్వాలని తెలిపారు. సంవత్సరంలో 100 గంటలు, వారంలో 2 గంటలు, పని చేస్తానని మా వీధుల చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతానని, పక్క వారికి కూడ తెలియజే స్తానని తెలుపుతూ విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని జ్యూట్ బ్యాగులు వాడాల ని కోరారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ ప్రవీణ్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ విష్ణు, ముజిబ్ పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

వెల్గటూర్, సెప్టెంబరు 26: ఉపాధ్యాయులు బోధన నైపుణ్యాలు పెంపొందించుకొని విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెపొందించేందకు కృషి చేయాలని జిల్లా సెక్టోరల్ అధికారి కొక్కుల రాజేష్ సూచించారు. గురువారం వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వెల్గటూర్, ఎం డపల్లి, గొల్లపల్లి మండలాల గణితం స్కూల్ అసిస్టెంట్లకు ప్రాథమికోన్నత స్థాయి పాఠశాల సముదాయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణితంలో ఆశించిన అభ్యసన ఫలితాలను విద్యార్థులు అందరూ సాధించేలా ఉపాధ్యాయులు ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలన్నారు. నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. పరీక్ష ఫలితాలను ఎప్పటికప్పుడు అన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు. ఎంఈవో బోనగిరి ప్రభాకర్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నందయ్య, సబ్జెక్ట్ రిసోర్స్ పర్సన్లు రవీంధర్, విజయ్ కుమార్, శ్రీనివాస్, సీఆర్పీ వెంకటేష్ పాల్గొన్నారు.

బుగ్గారం: విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు పెపొం దించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు మోహన్‌రెడ్డి సూచించారు. గురువారం బుగ్గారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగిత్యాల అర్బన్, జగిత్యాల రూరల్, బుగ్గారం మండలాల జీవశాస్త్రం బోధించే ఉపాధ్యాయు లకు ప్రాథమికోన్నత స్థాయి పాఠశాల సముదాయ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఆశించిన అభ్యసన సామర్థ్యాలు సాధించేలా వార్షిక ప్రణాళిక, బోధనోపకరణాలు వంటి వాటిని సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అబ్జర్వర్ పెద్ది రాజు, సబ్జెక్ట్ రిసోర్స్ పర్సన్లు తిరుపతి, నర్సయ్య, సీఆర్పీ పురుషోత్తం పాల్గొన్నారు.


వెల్గటూర్‌లో మాట్లాడుతున్న జిల్లా సెక్టోరల్ అధికారి రాజేష్

సంక్షిప్త సమాచారం

●**మల్లాపూర్ :** మండలంలోని సాతారం గ్రామానికి చెందిన వుడుగుల గంగాధర్ తండ్రి ఇటీవల మరణించగా రాష్ట్ర సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణరావు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

●మండలం కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ అధ్యక్షుడుగా మొగిలిపేట గ్రామానికి చెందిన వర్ధ సురేష్‌ను నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు ఆదేశాల మేరకు సురేష్‌తో పాటు ఉపధ్యక్షుడుగా ఓబులాపూర్‌కు చెందిన రాజం, ప్రధాన కార్యదర్శిగా కుస్థాపూర్‌కు చెందిన మైపాల్‌లను నియమించినట్లు పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జలపతిరెడ్డి తెలిపారు.

●అక్టోబర్ 4న కలెక్టరేట్ ముట్టడికి తరలి రావాలని జిల్లా రైతు ఐక్యవేదిక ఆధ్వర్యంలో నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా నలుమూలల నుంచి రైతులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. చెరుకు ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు మామాడి నారాయణరెడ్డి, రైతు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు నల్ల రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

●రాయికల్: గత ప్రభుత్వం విడుదల చేసి జీవో నెం.81, 85 ద్వారా 61 ఏళ్లు నిండిన వృద్ధ వీఆర్‌ఏ వారసులను ఉద్యోగ నియామ కం చేయాలని కోరుతూ తహసీల్దార్ ఖయ్యూంకు గురువారం వీఆర్ ఏలు వినతి పత్రం సమర్పించారు.

కథలాపూర్ : మండలంలోని పోసానిపేటకు చెందిన మారెల్లి లక్ష్మీ అనే నిరుపేద మహిళకు గురువారం ఉదయం ఫౌండేషన్ సభ్యులు నిత్యావసర సరుకులు, నగదు పంపిణీ చేశారు. దుంపెటకు చెందిన సైదు లక్ష్మీ అనే మహిళకు 30వ జగిత్యాల సహాయక బృందం నిత్యావసర సరుకులు పంపిణీ చేసింది. తీగల నరేశ్, తీగల మధురెడ్డి, నాగరాజు, నాగేందర్, మాజీ సర్పంచ్ ఎంజీ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ బత్తుల అశోక్ తునికి గంగనర్సయ్య, రణధీర్, ఎండీ సాధిక్ ఉన్నారు.

కోరుట్ల : వామపక్ష ఉద్యమ నేత సీతారం ఏచూరి సేవలు మరవలేనివని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు, వామపక్ష నేతలు సుతారి రాములు, పేట బాస్కర్‌లు అన్నారు. గురువారం పట్టణంలోని సి.ప్రభాకర్ భవనంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభలో సీపీఐ నాయకులతో కలిసి సీతారం ఏచూరి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లను అర్పించి మాట్లాడారు.

బీర్‌పూర్: బీర్‌పూర్ ఎంఈవోగా నాగాభూషణం గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంఈ వోగా విధులు నిర్వహించిన వాసం భీమయ్య బదిలీపై వెల్లాగా తన స్థానంలో నర్సింహులపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యయులుగా విధులు నిర్వ హిస్తున్న సిరూప నాగభూషణంకు ఎంఈవోగా అదన పు బాధ్యతలు అప్పగించారు.

● మండల కేంద్రాంలోని ఘాటు రోడ్డు వద్ద వెల్‌కమ్ బోర్డు ఏర్పాటు చేయడానికి గురువారం మున్నూర్ కాపు సంఘం నాయకులు భూమిపూజ చేశారు. జిల్లా అధ్యక్షులు ఏడ్నాల రాజ శేఖర్ ఆధ్వర్యంలో బీర్‌పూర్ మండలంలోని మున్నూరు కాపు సంఘం నాయకులు బీర్‌పూర్ నుండి జగిత్యాలకు వెల్లే రోడ్డుకు ఘాటు రోడ్డు వద్ద వెల్‌కమ్ బోర్డు ఏర్పాటు చేయాడానికి భూమిపూజ చేశారు.

జగిత్యాల అర్బన్: స్వాతంత్ర్య సమరయోధులు భగత్‌సింగ్ 117వ జయంతి సందర్భంగా భగత్‌సింగ్ విగ్రహ ఆహ్వాన కార్యక్రమానికి ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌కు అందజేశారు. చెట్‌పెల్లి సుధాకర్, ప్రభాత్ సింగ్ ఠాగూర్, భగత్‌సింగ్ యువ సేన సభ్యులు భానుతేజ రావు, భరత్, బోగ సాకేత్, సాయితేజ, అరవింద్, అఖిలేష్, పాల్గొన్నారు.

జగిత్యాల అగ్రికల్చర్: పట్టణంలోని స్థానిక రామకృష్ణ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రముఖ నైపుణ్య శిక్షణ సంస్థ దేశ్‌పాండే ఫౌండేషన్, కాకతీయ సాండ్ బాక్స్ వారు డిగ్రీ తృతీయ సంవత్సర విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ శిబిరం నిర్వహించి విద్యార్థులకు పలు నైపుణ్య అంశాలపై శిక్షణ అందించారు.

జగిత్యాలరూరల్ : వరిలోసుడిదోమ ఆశించే అవకాశం ఎక్కువ ఉన్నం దువల్ల రైతులు సుడిదోమ నివ దారణకై జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిని వాణి అన్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండలంలోని గుల్లపేట గ్రామంలో చేపడుతున్న పంటల సర్వేను తనిఖీ చేశారు.

కొడిమ్యాల: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని చొప్పదండి ఎమ్మెల్యే డా.. మేడిపల్లి సత్యం అన్నారు. గురువారం తిర్మాలాపూర్ గ్రామంలో చాకలి అయిలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ధైర్య సాహసాలతో పోరాడిన వీరవణిత అని కొనియాడారు.

●మండలంలోని అప్పారావుపేట గ్రామ పంచాయతీ పరిధిలో లే అవుట్ లేని వెంచర్‌లో ఎలాంటి ప్రకటనలు చేయకుండా నిర్మాణాలకు అనుమతి ఇచ్చిన విషయంపై గురువారం జిల్లా అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి, డీపీవో రఘువరణ్ కార్యదిర్శ విచారణ చేశారు. గతంలో గ్రామస్తులు ఇచ్చిన పిర్యాదు మేరకు విచారణ చేశారు.